సాక్షి
మెదక్
శనివారం । 2 । నవంబర్ । 2024



కొల్చారం(నర్సాపూర్): రంగంపేట శివారులో ధాన్యంలోకి చేరిన వర్షం నీరు

న్యూస్‌రీల్

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ



పోలీస్ సిబ్బందికి కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధా న కార్యాలయంలో సిబ్బందికి శీతాకాల కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు చలి, వాన, ఎండలో విధులు నిర్వర్తించే పరిస్థితులు ఉంటాయన్నారు. వారికి ఏ ఆటంకాలు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉంటుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

అదనపు కలెక్టర్ మాధవిలత

జోగిపేట(అందోల్): ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ మాధవిలత సిబ్బందికి సూచించారు. శుక్రవారం జోగిపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రం వద్ద రైతులు ఆరబెట్టిన వడ్లను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు తమ సమస్యలను వివరించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లిఫ్టింగ్ చేయాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. యార్డుకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి ఖాళీ చేయాలని పీఏసీఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం కొండల్‌రావు, పీఏసీఎస్ డీసీఓ కిరణ్ కుమార్, డీఎస్ఓ శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: డీఈఓ



కేజీబీవీలో భోజన వసతిని పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కల్హేర్(నారాయణఖేడ్): నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఈఓ వెంకటేశ్వర్లు సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం సిర్గాపూర్‌లో కేజీబీవీ, ఎమ్మార్సీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది, వంట నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. అంకితభావంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అంతకుముందు మండల కేంద్రంలో డ్రైడే, ఫ్రైడేలో పాల్గొన్నారు. సమగ్ర కుటుంబ సర్వేపై ఇంటింటా స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ నాగరం శ్రీనివాస్, ఎస్ఓ సంతోష, సీఆర్పీ శివకుమార్, మాజీ ఎంపీటీసీ పీరప్ప పాల్గొన్నారు.

ఎల్లుపేట పీహెచ్‌సీలో త్వరలో వైద్య సేవలు



అద్దె భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీరామ్

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని ఎల్లుపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పూర్తయ్యే వరకు అద్దె భవనంలో వైద్య సేవలు కొనసాగిస్తామని డీఎంహెచ్ఓ శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం ఎల్లుపేటలో అద్దె భవనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి దామోదర రాజనర్సింహ మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వైద్య సేవలు అందించేందుకు డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ నవీన్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి సుగుణాకర్, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశాకార్యకర్త రాణి తదితరులు ఉన్నారు.

ధాన్యం.. దైన్యం

వర్షానికి తడిసి ముద్దవుతున్న వడ్లు

- తిరిగి ఆరబోసేందుకు నానా తంటాలు
- ఇప్పటివరకు ప్రారంభం కాని కొనుగోళ్లు
- కలవర పెడుతున్న మబ్బులు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

మెదక్‌జోన్: అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. ఆ రుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా కష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతీ గింజా కొంటామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ప రిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి 20 రోజులు కావొస్తున్నా తూకం వేయడం లేదు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దకాగా వాటిని ఆరబెట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు. చేసేదిలేక మధ్య దళారులను ఆశ్రయించి వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు. మబ్బులు కలవర పెడుతుండడంతో 'సేటూ నా వడ్లు కొనవా' అంటూ ప్రాధేయ పడుతున్నారు.

50 శాతం వరికోతలు పూర్తి

గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 50 శాతం వరికోతలు పూర్తయ్యాయి. చెప్పుకోవడానికి అధికారులు 300 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు గింజ కూడా తూకం వేయలేదు. అకాల వర్షాలు వెంటాడుతుండడం.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో రైతులు దళారులను ఆశ్రయించి పచ్చి వడ్లనే క్వింటాల్‌కు రూ. 1,900 నుంచి రూ. 2,000 వరకు విక్రయిస్తున్నారు. దీనిని ఆసరా చేసుకొని వారు బస్తాకు మూడు కిలోల చొప్పున అదనంగా తూకం వేస్తున్నారు.

అన్నదాతపై అదనపు భారం

రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి 20 రోజులు కావొస్తున్నా తూకం వేయడం లేదు. అకాల వర్షాలకు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతుంది. చేసేది లేక తడిసిన ధాన్యాన్ని మళ్లీ కూలీలతో కలిసి ఆరబెడుతున్నారు. అంతేకాకుండా టాపర్ల అద్దె తడిసి మోపెడవుతోంది. ఇలా అదనపు భారం మోసే కన్నా వచ్చిన కాడికి అమ్ముకోవడమే మంచిదనే నిర్ణయానికి రైతులు వస్తున్నారు. మరో అవకాశం లేకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి అమ్ముకుంటున్నారు. ఎండిన వడ్లు వెంటవెంటనే తరలిస్తే ఇంత నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ధాన్యం త్వరగా తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని వేడుకుంటున్నారు.



రామాయంపేట: నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ



చిన్నశంకరంపేట: గవ్వలపల్లిలో వర్షానికి తడుస్తున్న ధాన్యం



రంగంపేటలో తడిసిన ధాన్యం ఎత్తుతున్న మహిళ



కాడిపల్లి: ధర్మాసాగర్‌లో నీటిలో కొట్టుకుపోతున్న వడ్లు



నిజాంపేట: అకాల వర్షానికి తడిసిన ధాన్యం

సమగ్ర వివరాలు నమోదు చేయాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌మున్సిపాలిటీ/హవేళిఘణాపూర్(మెదక్): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెదక్ మున్సిపాలిటీలోని నవాబుపేట వీధి 14 వార్డులో గృహాల జాబితా నమోదు కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 18,563 గృహాలు ఉన్నాయని తెలిపారు. 126 మంది ఎన్యూమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. 126 బ్లాకులుగా ఏర్పాటు చేసుకొని ఎలాంటి లోటుపాట్లు జరగకుండా సమర్థవంతంగా సర్వే నిర్వహించడానికి తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం హవేళిఘణాపూర్‌లో నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి గృహ యజమానులతో మాట్లాడారు. మీ ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు..? వేర్వేరుగా ఉంటున్నారా..? కలిసి ఉంటున్నారా..? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకే ఇంట్లో ఉంటూ వేర్వేరుగా వంట చేసుకునే వారికి సపరేట్ సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



మెదక్ పట్టణంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సంపూర్ణ అవగాహన అవసరం

మెదక్ కలెక్టరేట్: ఈనెల 6వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వేపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1.68 లక్షల కుటుంబాలున్నాయని, 1,600 మంది ఎన్యూమరేటర్లతో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించారు.

మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేటీఆర్ పాదయాత్ర కాదు కదా.. మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మరని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త 100 సభ్యత్వాలు పూర్తిచేసుకొని క్రియాశీల సభ్యత్వం పొందాలన్నారు. మాజీ మంత్రి కేటీఆర్, ఆయన తండ్రి కేసీఆర్ ఇద్దరూ రాజకీయాల నుంచి వైదొలిగిన తెలంగాణ ప్రజలకు ఎలాంటి నష్టం లేదన్నారు. వారు ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి రాలేదని, కేవలం ధనార్జనే ధ్యేయంగా వచ్చారని మండిపడ్డారు. దీపావళికి ముందే రాష్ట్రంలో పెద్ద నాయకుల అరెస్టులు ఉంటాయని, పండుగకు ముందే పటాకులు పేలుతాయని కాంగ్రెస్ నేతలు చెప్పారని గుర్తు చేశారు. దీపావళి పటాకులు పేలాయి తప్ప రాజకీయ అరెస్టులు కాలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, వెంకటనరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, రాజేశ్వరరావు దేశ్‌పాండే, దోమల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో పోలీస్‌యాక్ట్

సంగారెడ్డి జోన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఈనెల 30వ తేదీ వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నా, రాస్తా రోకో, నిరసన, ర్యాలీ, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. జిల్లా ప్రజలు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని సూచించారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లక్ష్మీ కటాక్షం అందరిపై ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా లక్ష్మీదేవి కటాక్షం ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీపావళి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్, సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన లక్ష్మీదేవి పూజల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బాణసంచా కాల్చి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



క్యాంపు కార్యాలయంలో క్రాకర్స్ కాలుస్తున్న మంత్రి పొన్నం, నాయకులు



పూజలో మహిళలు

వెలుగు దివ్వెలు.. సంతోష కాంతులు

- ఇంటింటా ఘనంగా దీపావళి
- గృహాలు, వ్యాపార సంస్థల్లో లక్ష్మీపూజ

దీపావళి పండుగను గురువారం జిల్లా ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. ఇంట్లో, వ్యాపార సంస్థల్లో లక్ష్మీదేవి పూజలు, కేదారి వ్రతాలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. బొమ్మల కొలువులు, ప్రత్యేక కార్యక్రమాలతో ప్రతి ఇంటా సంతోషాల కాంతులు విరబూశాయి. జిల్లాలో ఎక్కడ చూసినా దీపాల వెలుగులు విరజిమ్మాయి. తారా జువ్వలు.. బాంబుల మోతతో పట్టణాలు, పల్లెలన్నీ సందడిగా మారాయి. కలెక్టర్ రాహుల్‌రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపు కార్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు.

– మెదక్‌జోన్



కుటుంబ సభ్యులతో కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ మున్సిపాలిటీ: క్రాకర్స్ కాలుస్తున్న చిన్నారులు

అభ్యర్థి కోసం అన్వేషణ

- బలమైన నేతను బరిలోకి దింపేందుకు కమలం పార్టీ కసరత్తు
- పరిశీలనలో డాక్టర్ అంజిరెడ్డి, సత్యనారాయణగౌడ్ పేర్లు..
- మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ప్రదీప్‌రావు సైతం..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిత్వంపై భారతీయ జనతా పార్టీ ఫోకస్ చేసింది. బలమైన అభ్యర్థి కోసం అన్వేషిస్తోంది. నాలుగు ఉమ్మడి జిల్లాలో ప్రభావితం చేయగల అభ్యర్థిని బరిలోకి దింపాలని యోచిస్తోంది. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో విస్తృతంగా ఉండటంతో అన్ని జిల్లాలను ప్రభావితం చేయగల సమర్థవంతమైన అభ్యర్థిని పోటీలో నిలపాలని భావిస్తోంది. విద్యావంతులు, ఆర్థికంగా.. రెండు రకాలుగా బలమైన నేతలను బరిలోకి దింపాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా నలుగురి పేర్లు పార్టీ పరిశీలనలో ఉన్నట్లు కమలం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో పటాన్‌చెరుకు చెందిన పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సీహెచ్. అంజిరెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. విద్యావంతుడు కావడంతో పాటు, ఆర్థికంగా బలమైన నేత కావడంతో ఈ నేత పేరు పార్టీ అధినాయకత్వం పరిశీనలో ఉంది. అలాగే నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ రాష్ట్ర నేత సత్యనారాయణగౌడ్ పేరు కూడా వినిపిస్తోంది. రాజకీయాల్లో సీనియర్ నేత అయిన సత్యనారాయణగౌడ్ వివాద రహితుడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఒక ఎంపీ, మూడు ఎమ్మెల్యే స్థానాలను కమలం పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈ టికెట్‌ను ఇదే ప్రాంతానికి చెందిన నేతలకు ఇవ్వాలనే డిమాండ్ ఉంది. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, బీజేపీ జనరల్ సెక్రటరీ ప్రదీప్‌రావు పేర్లు కూడా పార్టీ నాయకత్వం పరిశీలనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

విస్తృతమైన పరిధి..

ఈ నియోజకవర్గం పరిధి విస్తృతంగా ఉంది. ఈ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మొత్తం ఆరు ఎంపీ నియోజకవర్గాలు, 43 ఎమ్మెల్యే నియోజకవర్గాలు ఉన్నాయి. దీంతో ఈ స్థాయిలో ప్రభావితం చూపగల నాయకుడిని అభ్యర్థిని ఎంపిక చేసేందుకు పెద్ద ఎత్తున కసరత్తు చేస్తోంది. అయితే చివరకు ఈ అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ ఇటు కమలం పార్టీలో నెలకొంది.



ఓటరు నమోదుపై నజర్

ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్న పట్టభద్రుల ఓటరు నమోదు కొనసాగుతోంది. ఎన్నికల బరిలో నిలవాలని భావిస్తున్న నేతలు ఓటరు నమోదుపై దృష్టి పెట్టారు. ఈ మేరకు సోషల్ మీడియా, ఇతర మార్గాల ద్వారా తమకు అనుకూలంగా ఉండే పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమైన పట్టణాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థిత్వం ఖరారైతే మరింత విస్తృతంగా ఓటరు నమోదుపై దృష్టి సారించే అవకాశాలున్నాయి. అయితే బీజేపీలో ప్రస్తుతం పార్టీ సభ్యత్వ నమోదు జరుగుతోంది. కొన్ని రోజుల్లోనే ఈ అభ్యర్థిత్వంపై పార్టీ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంటుందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

పిడుగుపాటుకు 25 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

కల్హేర్‌(నారాయణఖేడ్‌):పిడుగుపాటుకు మేకలు మృతి చెందిన ఘటన కల్హేర్‌ మండలం బీబీపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు మొల్ల ఇస్మాయిల్‌ మేకలు మేపుతూ జీవనో పాధి పొందుతున్నాడు. రోజుమాదిరిగా మేకలను మేతకు గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. ఉరుములు, మెరుపులతో వర్షం పడగా అప్పటికే మేకలను ఓ చెట్టు కింద చేర్చి నిల్చున్నాడు. ఒక్కసారిగా పిడుగుపడటంతో 15 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఇస్మాయిల్‌ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. రూ.2 లక్షల విలువైన మేకలు మృతి చెందాయని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

నిందితుడి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్‌

కొండపాక(గజ్వేల్‌): దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలోని ఓదస్‌చెర్వులో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు మంతూరి వజ్రవ్వపై మంతూరి అశోక్‌ ఇటీవల దాడి చేసి 3 తులాల పుస్తెల తాడుతోపాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. వృద్ధురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా గత నెల 31న త్రీ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఇందూర్‌ కళాశాల ఎదురుగా వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నాం. నిందితుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు అరెస్టు చేసి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను కోర్టులో హాజరుపర్చి జ్యుడిషియల్‌ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడి దారుణ హత్య



రోడ్డుపై మహేశ్‌ మృతదేహం

నారాయణఖేడ్‌: యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఖేడ్‌ సీఐ శ్రీనివాస్‌ రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌ రెడ్డి కథనం మేరకు.. ఖేడ్‌ పట్టణానికి చెందిన పలువురు గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అంత్వార్‌ వైపు మార్నింగ్‌ వాకింగ్‌ వెళ్తూ రోడ్డుపై ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి పరిశీలించి మృతుడి జేబులోని ఆధారాలను బట్టి నారాయణఖేడ్‌ మండలం ర్యాలమడుగుకు చెందిన దొంతిగారి మహేశ్‌(32)గా గుర్తించారు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించేందుకు గాను మృతదేహాన్ని ఈడ్చుకొచ్చినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఘటనా స్థలాన్ని అదనపు ఎస్పీ సంజీవరావు పరిశీలించి క్లూస్‌టీంతో ఆధారాలను సేకరించారు. స్థానిక సీఐ, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. హత్యకు సంబంధించి పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

లక్షణంగా వదిలేశారు

- పీహెచ్‌సీ, మండల పరిషత్‌, వైకుంఠధామాలకు ప్రహరీలు కరువు
- రెండేళ్ల కిందటే రూ.లక్షల్లో నిధులు మంజూరు
- నిర్మాణాలకు నోచుకోని వైనం
- ఉన్నత పాఠశాల అదనపు గదులకు ఇదే దుస్థితి
- ప్రారంభంకాని పనులు



ప్రహరీగోడ లేని సీహెచ్‌సీ



పీహెచ్‌సీ ఆవరణలో నిలిపిన వాహనాలు

కొడిపల్లి(నర్సాపూర్‌): నిధులు లేక అభివృద్ధి పనులు ఆగిపోయిన ఘటనలు వింటుంటాం. కానీ ఇక్కడ సరిపడా నిధులు ఉన్నా పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండల కేంద్రమైన కొడిపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. దీంతో అసాంఘీక కార్యక్రలాపాలకు, వాహదారుల బైక్‌ పార్కింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి.

మండల కేంద్రమైన కొడిపల్లిలో మండల పరిషత్‌ కార్యాలయం, తహసీల్దార్‌ కార్యాలయంలో పీఆర్‌ సబ్‌డివిజన్‌, పాలశీతలీకరణ కేంద్రం, ఎంఆర్‌పీ, ఏడీఏ కార్యాలయం, ఉపాధిహామీ, ఐకేపీ కార్యాలయాల భవనాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. వీటి చుట్టూ గతంలో ఫెన్సింగ్‌ వైర్‌ ప్రహరీగా ఉంది. అది ధ్వంసం కావడంతో ప్రస్తుతం ప్రహరీ లేకుండా పోయింది. దీంతోపాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ చుట్టూ గతంలో ప్రహరీ గోడ ఉండగా 765డీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రైవేట్‌ వాహనాలు పెట్టడంతోపాటు గదుల వరండాలో మద్యం తాగి సీసాలు అక్కడే వేస్తున్నారు.

ఆగిన రూ1.50 కోట్ల పనులు

ప్రహరీల సమస్యను గ్రామస్తులు అప్పటి ఎమ్మెల్యే (ప్రస్తుత మాజీ) ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ చూపి ఎస్‌డీఎఫ్‌ (స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌)లో భాగంగా రెండేళ్ల కింద రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. పీహెచ్‌సీకి రూ.40 లక్షలు, మండల పరిషత్‌ కార్యాలయం ప్రహరీకి రూ.40 లక్షలు, వైకుంఠధామం వద్ద ప్రహరీకి రూ.20 లక్షలు మంజూరు చేశారు. కాగా స్థానికులు ఆన్‌లైన్‌ టెండర్లు పొందినా నిర్మాణం పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు.

ఉన్నత పాఠశాలది ఇదే పరిస్థితి

కొడిపల్లి ఉన్నత పాఠశాలలో 450 మందికి పైగా విద్యార్థులు ఉండగా ఎనిమిది గదులు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లిష్‌ మీడియంలో విద్యాబోధన జరుగుతోంది. గదుల కొరత ఉండగా రూ.50 లక్షలు అదనపు గదుల కోసం మంజూరు చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. టెండర్లు పూర్తి అయినా ఇక్కడి నాయకుల సహకారం లేదని టెండర్‌ దారుడు టెండర్‌ను రద్దు చేయించుకున్నాడు. దీంతో విద్యార్థుల సమస్య తీరడం లేదు. అధికారులు స్పందించి అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయమైన పీఆర్‌ డిప్యూటీ ఈఈ అమరేశ్వర్‌ను వివరణ కోరగా త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్‌ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. కమిషనర్‌ కార్యాలయంలో హుస్నాబాద్‌ డివిజన్‌ పోలీసు అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ఇన్ఫర్మేషన్‌ వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణ జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. హుస్నాబాద్‌, చేర్యాల పట్టణంలో ట్రాఫిక్‌ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ప్రతిరోజూ మానిటర్‌ చేయాలని, పనిచేయని సీసీ కెమెరాలను వారం రోజుల్లోపు రిపేర్‌ చేయించాలని సూచించారు. సమావేశంలో హుస్నాబాద్‌ ఏసీపీ సతీష్‌, సీఐ శ్రీనివాస్‌, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్‌, కిరణ్‌ ఎస్‌ఐలు విజయ్‌భాస్కర్‌, రాజు, మహేశ్‌, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నదీపాయల్లో మునిగి వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్‌): మంజీరా నదీపాయలోకి మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులో శుక్రవారం వెలుగు చూసింది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం మేరకు.. రేగోడ్‌ మండల కేంద్రానికి చెందిన గుడిసెల లక్ష్మణ్‌(24) పాత సామగ్రి కొనుగోలు చేస్తూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల దసరా సందర్భంగా దుర్గామాత విగ్రహాలను పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లే రెండో బ్రిడ్జి మంజీరా నదీపాయల్లో నిమజ్జనం చేశారు. విగ్రహాలకు ఉన్న ఇనుప ఊచలను ఊడదీసి అమ్ముకునేందుకు గురువారం సాయంత్రం లక్ష్మణ్‌ బంధువులతో కలిసి నదీపాయల వద్దకు వెళ్లాడు. లక్ష్మణ్‌ నీటిలోకి దిగగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. వెంటనే బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి..

పాపన్నపేట(మెదక్‌): చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అబ్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీరుడి నాగయ్య(63) బుధవారం రాత్రి చేపలు పట్టేందుకు స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. విద్యుత్‌ తీగలతో కరెంట్‌ షాక్‌ పెట్టి చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండగా కరెంట్‌ షాక్‌ కొట్టి నీటిలో పడి చనిపోయాడు. రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గురువారం ఉదయం వెళ్లి చెరువు వద్ద చూడగా ఒడ్డున చెప్పులు కనిపించాయి. గ్రామస్తుల సాయంతో నీటిలో వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు దశరథ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పండుగకు ఊరికెళ్లి వస్తుండగా..

- కారులో గుండెపోటుతో వ్యక్తి మృతి
- మృతుడు ఈఎస్‌ఐ ఆస్పత్రిలో డాక్టర్‌



శ్రీనివాస్‌ (ఫైల్‌)

అల్లాదుర్గం(మెదక్‌): దీపావళి పండుగను సంతోషంగా జరుపుకున్న ఆ ఇంట అంతలోనే విషాద చాయలు అలుముకున్నాయి. పండుగకు సొంత గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారులో గుండెపోటు రావడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చిల్వెర గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా జుకల్‌ మండలం పెద్ద ఎడిగి గ్రామానికి చెందిన కదేవర్‌ శ్రీనివాస్‌(40) ఈఎస్‌ఐ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య సీత బిందు ప్రైవేట్‌ డాక్టర్‌. వీరికి యోశ్విత్‌ (3), అక్షిత్‌ 10 నెలల ఇద్దరు కుమారులుండగా, చందానగర్‌లో నివాసం ఉంటున్నారు. దీపావళి పండుగకు శ్రీనివాస్‌, యోశ్విత్‌తో కలిసి స్వగ్రామమైన పెద్ద ఎడిగికి వెళ్లారు. శుక్రవారం ఉదయం శ్రీనివాస్‌ ఒక్కడే కారులో చందానగర్‌ బయలుదేరాడు. చిల్వెర గ్రామ శివారులోకి రాగానే గుండెపోటు రావడంతో రోడ్డుపైనే కారు నిలిపాడు. ఇది గమనించిన చిల్వెర గ్రామానికి చెందిన యాదయ్య, స్థానికులు 108 అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సీత బిందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



నందిని

చేగుంట(తూప్రాన్‌): రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్‌ ఫెడరేషన్‌ కబడ్డీ పోటీలకు చందాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నందిని ఎంపికైనట్లు పీడీ శంకర్‌ తెలిపారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్‌–17 విభాగంలో కబడ్డీ పోటీల్లో పాల్గొంది. ఇందులో ప్రతిభ కనబర్చి త్వరలో మహబూబ్‌నగర్‌ వనపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రధానోపాధ్యాయులు కిషన్‌, ఉపాధ్యాయ బృందం ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌ సంతోష అభినందించారు.

రంగంపేట విద్యార్థిని..

కొల్చారం(నర్సాపూర్‌): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అక్షయ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా నుంచి తమ విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడుతోపాటు పీడీ శ్రీధర్‌ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

భుజిరంపేట విద్యార్థినులు

కొడిపల్లి(నర్సాపూర్‌): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని భుజిరంపేట ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినీలు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమాకాంత్‌, పీడీ శేఖర్‌ తెలిపారు. ఎస్‌జీఎఫ్‌ క్రీడల్లో భాగంగా శుక్రవారం సిద్దిపేటలో జరిగిన పోటీల్లో విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అండర్‌ 17 విభాగంలో వైష్ణవి, అండర్‌ 14 విభాగంలో దీక్ష, తహసిన్‌ ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థులు..

మర్కుక్‌(గజ్వేల్‌): మర్కుక్‌ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు రవళి, దాక్షిణ్య రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. రేపు అదిలాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి టేబుల్‌ టెన్నీస్‌ పోటీలకు..

మెదక్‌జోన్‌: ఉమ్మడి మెదక్‌ జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ టేబుల్‌ టెన్నీస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు జిల్లా కేంద్రంలోని గుల్షన్‌ క్లబ్‌ ఆవరణలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చి హవేళిఘణాపూర్‌ మండలం కూచన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే పోటీల్లో పాల్గొంటారని టేబుల్‌ టెన్నీస్‌ జిల్లా సెక్రెటరీ డాక్టర్‌ ప్రభు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు మధుసూదన్‌, హరీశ్‌, లక్ష్మణ్‌, ఉన్నత పాఠశాల కూచన్‌పల్లి పీడీ వినోద్‌ కుమార్‌ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ రోటవేటర్‌లో ఇరుక్కొని డ్రైవర్‌ మృతి

హత్నూర మండలంలో ఘటన



కొమురయ్య (ఫైల్‌)

హత్నూర(సంగారెడ్డి): ట్రాక్టర్‌ రోటవేటర్‌లో ఇరుక్కొని డ్రైవర్‌ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్‌ జిల్లా ఘనపూర్‌ గ్రామానికి చెందిన కొమురయ్య(40) ఇల్లరికం కింద బడంపేట గ్రామానికి వచ్చి గవ్వల మల్లయ్య కూతురు నాగమణిని వివాహం చేసుకున్నాడు. గ్రామంలో సొంత ట్రాక్టర్‌తో రోటవేటర్‌ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో రోటవేటర్‌ వేసేందుకు ట్రాక్టర్‌ తీసుకొని వెళ్లాడు. ఇంతలోనే అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్‌ రోటవేటర్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని కొమురయ్య మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబీకులకు నచ్చజెప్పారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో, బైక్‌ ఢీకొని ఒకరు



పీరయ్య(ఫైల్‌)

పెద్దశంకరంపేట(మెదక్‌): ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్‌ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన తలారి పీరయ్య(36) అల్లాదుర్గం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పటాన్‌చెరువు వద్ద మృతి చెందాడు. మృతుడి భార్య తలారి సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ విఠల్‌ తెలిపారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి..



పండరి మృతదేహం

రాయికోడ్‌(అందోల్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని శంశోద్దీన్‌పూర్‌ గ్రామ శివా రులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివాజీ సమీప గ్రామం నాగూర్‌కి చెందిన బీ.పండరితో కలిసి ట్రాలీ ఆటోలో ఖాళీ సంచుల లోడ్‌తో రాయికోడ్‌కు వచ్చారు. ఆటోను ఖాళీ చేసి తిరుగుప్రయాణం అయ్యారు. మండలంలోని శంశోద్దీన్‌పూర్‌ గ్రామ శివారులోకి రాగానే ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై పండరి మృతి చెందాడు. తన కుమారుడి మరణానికి కారణమైన ఆటోడ్రైవర్‌ శివాజీపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి దిలీప్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం కుప్పను ఢీకొని తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్‌):ధాన్యం కుప్పను బైక్‌తో ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన బత్తిని రమేశ్‌ బైక్‌పై శుక్రవారం రాత్రి గవ్వలపల్లి నుంచి స్వగ్రామమైన గజగట్లపల్లికి వెళ్తున్నాడు. చిన్నశంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామ శివారులోకి రాగానే చీకట్లో ధాన్యం కుప్ప కనిపించకపోవడంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేశ్‌ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గవ్వలపల్లిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నిథిమ్‌ సర్టిఫికెట్‌ అందజేత



సర్టిఫికెట్‌ అందుకుంటున్న ప్రసన్న

కొడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన ఐకేపీ ద్వాక్రా మహిళ ప్రసన్న ఇందిర కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌, డీఆర్‌డీఓ శ్రీనివాస రావు చేతుల మీదుగా నిథిమ్‌ (నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌) సర్టిఫికెట్‌ పొందినట్లు ఐకేపీ డీపీఎం మోహన్‌, ఏపీఎం సంగమేశ్వర్‌ శుక్రవారం తెలిపారు. ఈమె ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ మేనేజ్‌మెంట్‌ ట్రైనింగ్‌ను గతవారం హైదరాబాద్‌ నిథిమ్‌లో పూర్తి చేసిందన్నారు.

విధుల్లో నిర్లక్ష్య ధోరణి

శివ్వంపేట ఎస్‌ఐ ఎస్పీ కార్యాలయానికి అటాచ్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డిని ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్‌ చేస్తూ శుక్రవారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి గుండ్లపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి రాజుకు సంబంధించి లారీ, నర్సాపూర్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు చెందిన కారు దౌల్తాబాద్‌ వద్ద ప్రమాదానికి గురి కాగా వడ్ల వెంకటేశ్‌ (సస్పెండ్‌లో ఉన్న హోంగార్డు) 4 రోజుల కిందట రాజు ఇంటికెళ్లి ఎస్‌ఐని అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. కారు రిపేర్‌కురూ.53 వేలు ఇవ్వాలని నకిలీ బిల్లులతో డిమాండ్‌ చేశాడు. బాధితుడు రాజు మంగళవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి పట్టించుకోకుండా రాజీ కుదర్చడంతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్‌ చేశారు. వెల్దుర్తి ఎస్‌ఐ రాజు శివ్వంపేట ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు.

రైస్‌ మిల్లులో అగ్ని ప్రమాదం



చిన్నశంకరంపేట(మెదక్‌): దగ్ధమైన గన్నీ సంచులు

చిన్నశంకరంపేట(మెదక్‌): నార్సింగి మండల కేంద్రంలోని న్యూ తిరుమల రైస్‌మిల్లులో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రైస్‌ మిల్లులోని గన్నీ సంచులకు నిప్పంటుకొని మంటలు ఎగిసిపడ్డాయి. రైస్‌మిల్లు యజమాని శ్రవణ్‌కుమార్‌(బాబీసేట్‌) పోలీస్‌లకు, రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా మంటలను అదుపు చేశారు. సుమారు రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైస్‌మిల్లు యజమాని వాపోయాడు.

ఫ్యాన్సీ స్టోర్‌ దగ్ధం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక కూరగాయల మార్కెట్‌లో గురువారం అర్ధరాత్రి షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా ఫ్యాన్సీ స్టోర్‌తోపాటు రెండు పండ్ల దుకాణాలు దగ్ధమయ్యాయి. వలస రాష్ట్రానికి చెందిన జితేందర్‌ కుటుంబంతో కలిసి మార్కెట్‌లో ఫ్యాన్సీ స్టోర్‌ నడుపుతున్నాడు. ప్రమాదవశాత్తు షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా స్టోర్‌లోని దాదాపు రూ.5 లక్షల సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న రెండు పండ్ల దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు ఆనంద్‌ కృష్ణారెడ్డి తక్షణ సాయంగా రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు

దౌల్తాబాద్‌ (దుబ్బాక) : దౌల్తాబాద్‌ మండల పరిధిలో గల గాజులపల్లి గ్రామంలో గురువారం విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మారుపాక అర్జున్‌ కుటుంబ సభ్యులు వేరే గ్రామానికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని బంగారం, వెండి, డబ్బులు కాలిపోయాని బాధితుడు వాపోయాడు.

గ్లాస్‌ ఫ్రేమ్‌ వర్క్‌ షాపులో ..

సిద్దిపేటకమాన్‌: జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం సమీపంలో మల్లేశంకు చెందిన గ్లాస్‌ ఫ్రేమ్‌ వర్క్‌ షాపులో షార్ట్‌ సర్క్యూట్‌ వల్ల మంటలు చెలరేగాయి. దీంతో షాపు పై భాగంలో నిరుపయోగంగా ఉన్న కట్టెలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పేశారు.

పటాన్‌చెరు ఎస్‌ఐ సస్పెండ్‌

గంజాయి స్మగ్లర్లకు సహకరించిన నేపథ్యంలో..



అంబారియా

పటాన్‌చెరుటౌన్‌ : గంజాయి స్మగ్లర్లకు సహకరించిన పటాన్‌చెరు ఎస్‌ఐ అంబారియాను మల్టీ జోన్‌–2 ఐజీ సత్యనారాయణ సస్పెండ్‌ చేశారు. ప్రస్తుతం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న అంబారియా ఈ ఏడాది మనూర్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో కానిస్టేబుల్‌తో కలిసి ఓ వాహనాన్ని అడ్డుకొని గంజాయిని తమ వాహనంలోకి తీసుకొని, ఆ వాహనంతో సహా నిందితుడిని వదిలిపెట్టారు. ఇటీవలె బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో పట్టుబడిన గంజాయి నేరస్తులను విచారించగా గంజాయి కేసుల్లో పోలీసుల చేతివాటం బయటపడింది. దీంతో ఎస్‌ఐ అంబారియాపై వేటు పడింది.

భూమి తన పేరిట కాలేదని..

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



స్వామి(ఫైల్‌)

దుబ్బాకరూరల్‌: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోషిగారి స్వామి(39) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నెల రోజుల కిందట తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి స్వామి మద్యానికి అలవాటు పడ్డాడు. తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమి తన పేరిట కాలేదని తరచూ భార్యతో చెప్పుకుంటూ బాధపడుతుండేవాడు. గురువారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి భార్యకు లేచి చూడగా స్వామి కనిపించలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతుకగా గ్రామంలోని చెట్టుకు లుంగితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..



దేవదాస్‌(ఫైల్‌)

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్‌ కథనం మేరకు.. మెదక్‌ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన తుమ్మల దేవదాసు(59) తన అత్తగారి గ్రామమైన పోతారెడ్డిపేటలో 20 ఏళ్లుగా భార్య పిల్లలతో ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదని తరచూ భార్యకు చెప్పుకుంటూ బాధ పడుతుండేవాడు. శుక్రవారం ఉదయం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామ శివారులోని చెరువులో దూకుతుండగా చుట్టు పక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. గ్రామస్తులు చెరువులో వెతుకుతుండగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

షార్ట్‌ ఫిలిం చిత్రీకరణ



చిత్రీకరణలో నటీనటులు, దర్శకుడు, తదితరులు

నిజాంపేట(మెదక్‌): మండల కేంద్రంలోని శ్రీ మంజీరా స్కూల్‌ ఆవరణలో గల్లీ గ్యాంగ్‌ షార్ట్‌ ఫిలిం షూటింగ్‌ జరిగింది. ఈ సందర్భంగా కథ, స్క్రీన్‌ ప్లే, దర్శకుడు శ్రీధర్‌ మాట్లాడుతూ సమాజానికి మంచి మెసేజ్‌ అందించే వినోదాత్మకంతో కూడిన షార్ట్‌ ఫిలిం నిర్మించి సమాజానికి మంచి చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ సినిమా చూసి ఆనందించాలన్నారు. హీరోయిన్‌ రితిక నటనతో ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నటీనటులు బత్తులశివ, లక్ష్మణ్‌, శ్రీకాంత్‌, దినేశ్‌, చింటూ, ప్రవీణ్‌, నవీన్‌, మెడికల్‌ లక్ష్మణ్‌, చందు, గుడ్ల చంద్రం, తదితరులు పాల్గొన్నారు.